

Registered No : APTEL/25/A0818

ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక



శనివారం 21-11-2026 | పేజీలు :4 | వెల :2 | సంపుటి :02 | సంచిక :152 | www.edhikadhanijam.com | ఎడిటర్ : బాలరాజు గౌడ్

కార్తీక దీపానికి పరిమిత అనుమతి!

హైకోర్టు తీర్పులోని అంశాలపై సుప్రీం స్టే
నవంబర్ 24న దీపం వెలిగింపునకు వెసులుబాటు
భవిష్యత్ ఆచార హక్కులకు ప్రాతిపదిక కాదు
సాధారణ ప్రజలకు దీపతూణ్ వద్ద నో ఎంట్రీ
అవసరమైతే సీఐఎస్ఎఫ్ భద్రత
నోడల్ అధికారిగా మదురై జిల్లా కలెక్టర్
మూడు రోజుల్లో కలెక్టర్ నివేదిక సమర్పణ


2 లో

న్యూస్ డెస్క్, 20 నవంబర్ (ఇది కద నిజం): తమిళనాడు మదురైలోని తిరుప్పరంకుండ్రం కొండపై ఉన్న దర్గా సమీపంలోని 'దీపతూణ్' (రాతి స్తంభం) వద్ద కార్తీక దీపం వెలిగించేందుకు అనుమతిస్తూ మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పులోని పరిశీలనలపై సుప్రీంకోర్టు శుక్రవారం (నవంబర్ 20) స్టే విధించింది. అయితే, ఒకే ఒక్కసారి వెసులుబాటుగా (వన్-టైమ్ మెజర్) ఈ ఏడాది కార్తీక దీపం పర్వదినమైన నవంబర్ 24న దీపతూణ్ వద్ద దీపం వెలిగించేందుకు అత్యున్నత న్యాయస్థానం అనుమతి ఇచ్చింది. వివాదాస్పద ప్రదేశంలో దీపం వెలిగించే సంప్రదాయానికి దీనిని తుది ఆమోదంగా పరిగణించరాదని కోర్టు స్పష్టం చేసింది.

ఈ అనుమతిని భవిష్యత్తులో ఏ పక్షమూ తమకు ఉన్న ఆచార హక్కుకు సాక్ష్యంగా వాడుకోకూడదని,

కేసీఆర్‌తో భేటీకి సిద్ధం.. రేవంత్ కీలక వ్యాఖ్యలు!

మోడీపై రేవంత్ రెడ్డి ఘాటు విమర్శలు
12 ఏళ్లలో రూ.120 లక్షల కోట్ల అప్పులు
అదానీ నుంచి నిధులు తెచ్చి తెలంగాణ అభివృద్ధి
ఓటు హక్కును తొలగించే కుట్ర అంటూ ఆరోపణ
తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు మోడీకి ఆహ్వానం
కేటీఆర్‌పై రేవంత్ సెటైర్లు
కేసీఆర్‌ను రాజకీయ ప్రత్యర్థిగా గుర్తింపు

2 లో

ఏపీఎండీసీ ఐపీవోకు చంద్రబాబు గ్రీన్ సిగ్నల్!

రూ.7.8 లక్షల కోట్ల ఖనిజ సంపద
వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి స్టాక్ మార్కెట్ లిస్టింగ్
ఏపీఎండీసీ ఈక్విటీ విలువ రూ.86,290 కోట్లు
అరుదైన ఖనిజాల కోసం ప్రత్యేక కార్పొరేషన్
ఏఐతో 582 ఖనిజ అన్వేషణ ప్రాంతాల గుర్తింపు
మూడు బొగ్గు బ్లాకుల్లో 1,774 మిలియన్ టన్నుల నిల్వలు
క్వారీ దరఖాస్తులతో రూ.400 కోట్ల ఆదాయం

2 లో

యాదాద్రిలో వైభవంగా కోటి పుష్పార్చన


3 లో

- మాడవీధులలో శోభాయమానంగా సాగిన స్వామివారి ఊరేగింపు
- రాష్ట్ర ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించిన ఆలేరు ఎమ్మెల్యే



ఏపీకి లీక్ విజయ్‌కి షాక్!

- పెట్టుబడుల రహస్యాల లీక్ కలకలం!
- ఏపీకి సమాచారం చేరిందా?
- 15 మంది ఉద్యోగులపై వేటు!
- ఏపీకి చేరిన తమిళ మాజీ ఉద్యోగులు
- ముగ్గురి చేరికతో ముదిరిన వివాదం
- సమ్మిట్ ఫొటోలతో రచ్చ రచ్చ!
- మంత్రి సమీక్షల్లో అనుమానాల వెల్లువ
- తొలగింపులా.. స్వచ్ఛంద రాజీనామాలా?
- రూ.1,614 కోట్ల పెట్టుబడులతో కొత్త మలుపు!

న్యూస్ డెస్క్, 20 నవంబర్ (ఇది కద నిజం): తమిళనాడులోని విజయ్ సర్కార్ సంచలనం నిర్ణయం తీసుకుంది.. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ మధ్య పారిశ్రామిక పెట్టుబడుల పోటీ ఇప్పుడు కొత్త వివాదానికి దారితీసింది. తమిళనాడుకు రావాల్సిన పరిశ్రమలు ఆంధ్రప్రదేశ్‌కు తరలిపోతున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో పెట్టుబడులకు సంబంధించిన అత్యంత రహస్య సమాచారం ఏపీకి చేరిందనే ప్రచారం కలకలం రేపుతోంది. ఈ వ్యవహారంలో తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని ప్రభుత్వం కీలక చర్యలకు ఉపక్రమించింది.. పెట్టుబడుల ప్రోత్సాహక సంస్థ గైడెన్స్ తమిళనాడుకు చెందిన సుమారు 15 మంది కాంట్రాక్టు ఉద్యోగులపై ప్రభుత్వం వేటు వేసింది.. అయితే ఈ ఉద్యోగుల తొలగింపునకు, సమాచారం లీక్ ఆరోపణలకు సంబంధించి పూర్తి వివరాలు అధికారికంగా వెల్లడికావాల్సి ఉంది..

మిగతాది 2 లో..

కాంగ్రెస్‌లో భారీ నియామకాలు!

ఏఐసీసీలో కీలక నియామకాలు
రాష్ట్రాలకు కొత్త కార్యదర్శుల నియామకం
తెలంగాణకు సచిన్ సావంత్, సైమన్ అలెక్స్
ఏపీకి సెంథమిళ్ అరసు, వి. శంకర్
పలు రాష్ట్రాలకు కొత్త బాధ్యులు
మీడియా విభాగానికి వినీత్, రుచిరా
పలు ఏఐసీసీ విభాగాల్లో మార్పులు

న్యూస్ డెస్క్, 20 నవంబర్ (ఇది కద నిజం): అఖిల భారత కాంగ్రెస్ కమిటీ లో పలువురు నేతలను కార్యదర్శులుగా నియమిస్తూ, మరికొందరికి వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, విభాగాల బాధ్యతలను అప్పగిస్తూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ అధికారికంగా ప్రకటించారు. ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని స్పష్టంగా పేర్కొన్నారు. ఇక కాంగ్రెస్ అధ్యక్షుడి కార్యాలయానికి ప్రణవ్ ఝా, గౌరవ్ పాంధీలను నియమించగా.. కమ్యూనికేషన్, పబ్లిసిటీ, మీడియా (సోషల్ డిజిటల్ మీడియాతో కలిపి) విభాగ బాధ్యతలను డాక్టర్ వినీత్ పునియా, రుచిరా చతుర్వేదిలకు అప్పగించారు.

2 లో

రేయ్.. చేతులు నరికేస్తా! కేపీ పాల్ వార్నింగ్!



యువతులపై దాడుల ఘటనపై కేపీ పాల్ ఫైర్
దాడి చేసిన వారిపై తీవ్ర హెచ్చరిక
పోలీసుల చర్యలపై పాల్ ప్రశ్నలు
రేవంత్ సీఎం పదవిపై సంచలన వ్యాఖ్యలు
బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్‌తో పొత్తుకు సిద్ధం
అధికారంలోకి వస్తే అప్పులు తీరుస్తానని హామీ
యువత కలిసి పోరాడాలని పిలుపు

2 లో

రూ.40 కోట్ల కుంభకోణం.. రేఖానాయక్‌కు ఉచ్చు!

రూ.40.96 కోట్ల సీఎంఆర్ కుంభకోణం
రేఖానాయక్ నివాసాలపై ఈడీ, విజిలెన్స్ దాడులు
ప్రభుత్వ ధాన్యంలో 9,639 టన్నుల కొరత
ఏఆర్ఎస్ ఇండస్ట్రీస్‌పై అవకతవకల ఆరోపణలు
మనీలాండరింగ్ కోణంలో ఈడీ దర్యాప్తు
రేఖానాయక్ అరెస్ట్‌పై ఉత్కంఠ
ఖానాపూర్‌లో భారీ పోలీసు బందోబస్తు


2 లో

న్యూస్ డెస్క్, 20 నవంబర్ (ఇది కద నిజం): నిర్మల్ జిల్లా ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకురాలు రేఖానాయక్ చుట్టూ సీఎంఆర్ కుంభకోణం ఉచ్చు బిగుస్తోంది. సుమారు రూ.40.96 కోట్ల విలువైన ప్రభుత్వ ధాన్యం మాయమైన కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, విజిలెన్స్ అధికారులు శుక్రవారం సంయుక్తంగా రంగంలోకి దిగారు. రేఖానాయక్ నివాసాలతో పాటు మొత్తం రెండు చోట్ల ఏకకాలంలో అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహిస్తూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

చిన్నారుల ప్రాణాలకు డాక్టర్ శివరంజని భరోసా!


2 లో

రూ.9 కోట్ల మందు ధర రూ.2.5 లక్షలకు
డాక్టర్ శివరంజని కృషికి అరుదైన విజయం
ఏడుగురు చిన్నారులకు ఉచితంగా మందులు
నవంబర్ 30న ఔషధాల పంపిణీ
అరుదైన జన్యు వ్యాధికి కీలక చికిత్స
పేద కుటుంబాలకు కొత్త ఆశలు
యాక్సెస్ టు మెడిసిన్స్ ఇండియా సహకారం

బూతులు, అబద్ధాలే రేవంత్ ప్రసంగం!

రేవంత్ ప్రసంగంపై హరీశ్ ఫైర్
వ్యక్తిగత విమర్శలపై మండిపాటు
కృష్ణా జలాలపై సీఎం తీరుకు కౌంటర్
చంద్రబాబు జలదోపిడీకి సహకారం
పంపులు, మోటార్లపై అబద్ధాలు
299 టీఎంసీల వినియోగంలో విఫలం
ప్రభుత్వంపై హరీశ్ పోరాటం



2 లో

న్యూస్ డెస్క్, 20 నవంబర్ (ఇది కద నిజం): సిద్దిపేట సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అబద్ధాలు, బూతులు తప్ప మరేమీ మాట్లాడలేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తీవ్రస్థాయిలో విమర్శించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి ప్రసంగ తీరు, ప్రభుత్వ వైఖరిపై పలు కీలక ఆరోపణలు చేశారు.

సభ తీరు, వ్యక్తిగత వ్యాఖ్యలపై ఆగ్రహం..

ఇందిరమ్మ జీవిత బీమా పథకం ప్రారంభోత్సవానికి వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి, ఆ పథకం గురించి ఒక్క మాట కూడా మాట్లాడలేదని హరీశ్ రావు మండిపడ్డారు. తన ఎత్తు, కేటీఆర్ గడ్డం గురించి మాట్లాడేందుకే సిద్దిపేటకు వచ్చారా అని ఆయన ప్రశ్నించారు. సిద్దిపేట సభకు ఇతర జిల్లాల నుంచి ప్రజలను తరలించారని, ఈ విషయాన్ని సిద్దిపేట కమిషనరే స్వయంగా తనతో చెప్పారని పేర్కొన్నారు. సీఎం తీవ్ర నైరాశ్యంలో ఉన్నందునే ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని, కరువు నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఇలాంటి ప్రయత్నాలు చేస్తున్నారని సెటైర్లు వేశారు.

సాగునీటి హక్కులు, కృష్ణా జలాలపై విమర్శలు

తెలంగాణ సాగునీటి హక్కులను ఆంధ్రప్రదేశ్‌కు ధారాదత్తం చేస్తున్నారని, చంద్రబాబు జలదోపిడీకి రేవంత్ రెడ్డి సహకరిస్తున్నారని హరీశ్ రావు ఆరోపించారు. గతంలో కాంగ్రెస్ హయాంలోనే శ్రీశైలం నుంచి జలదోపిడీ జరిగిందని, ఇప్పుడు నాగార్జునసాగర్ నుంచి కూడా నీటిని తరలించుకుపోయే కుట్రలు జరుగుతున్నాయని అన్నారు.

క్యాన్సర్‌పై యుద్ధం.. ప్రజల వద్దకే వైద్యం!

క్యాన్సర్ స్క్రీనింగ్ వాహనం ప్రారంభం
బాలకృష్ణ చేతుల మీదుగా వాహనం ప్రారంభం
మారుమూల ప్రాంతాలకు స్క్రీనింగ్ సేవలు
ముందస్తు గుర్తింపుతో క్యాన్సర్ నివారణ
ప్రజల వద్దకే వైద్య పరీక్షలు
సీఎస్ఆర్ సహకారంతో సేవల విస్తరణ
క్యాన్సర్ నివారణపై అవగాహన కార్యక్రమాలు

2 లో

Registered No : APTEL/25/A0818

ఇది కద నిజం

శనివారం 21-11-2026

బూతులు, అబద్ధాలే రేవంత్ ప్రసంగం!

మొదటి పేజీ తరువాయి

తమ ప్రభుత్వం నుంచి వైదొలిగిన 40 రోజుల తర్వాత పోతిరెడ్డిపాడుపై జీవో వచ్చిందని, ఆనాడు తమకు మద్దతు పలికిన ఏకైక కాంగ్రెస్ నేత పీజేఆర్ అని గుర్తు చేశారు. కృష్ణా జలాల్లో 299 టీఎంసీల వాటాకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని, రాష్ట్రం ఏర్పడిన 40 రోజుల్లోనే కృష్ణా జలాల పునఃపంపిణీ చేయాలని కేసీఆర్ డిమాండ్ చేశారని తెలిపారు. కృష్ణా ట్రిబ్యూనల్ సాధించింది బీఆర్ఎస్ పార్టీనే అయినప్పటికీ, ప్రస్తుత ప్రభుత్వం ట్రిబ్యూనల్ ముందు సరైన వాదనలు వినిపించడం లేదని విమర్శించారు.

పంపులు, మోటార్లపై అబద్ధాలు..

నీళ్లు ఎత్తేందుకు పంపులు, మోటార్లు లేవని రేవంత్ రెడ్డి అబద్ధాలు చెప్పడం సిగ్గుచేటని హరీశ్ రావు అన్నారు. దేవాదుల వద్ద పూర్తిస్థాయిలో మోటార్లు ఎందుకు నడపడం లేదని, శ్రీశైలం నుంచి పూర్తిస్థాయిలో నీటిని ఎందుకు ఎత్తలేకపోయారని ప్రశ్నించారు. కృష్ణాలో కనీసం 299 టీఎంసీలను కూడా ఈ ప్రభుత్వం వాడుకోవడం లేదని, చంద్రబాబుకు గురుదక్షిణ చెల్లించడంలో భాగంగానే ఇలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

కాంగ్రెస్ అంతర్గత పరిస్థితి, ప్రజాపక్ష పోరాటం

రేవంత్ రెడ్డి పరిపాలన బాగోలేదని కాంగ్రెస్‌లోని పేరుమోసిన ఎమ్మెల్యేలే బహిరంగంగా చెబుతున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చని హరీశ్ రావు అన్నారు. అబద్ధాలు చెప్పడంలో రేవంత్‌కు ఆస్కార్ ఇవ్వొచ్చని ఎద్దేవా చేశారు. గతంలో ఉద్యమకారులపై తుపాకీ ఎక్కుపెట్టిన చరిత్ర, తెలంగాణ కోసం రాజీనామా చేయమంటే జిరాక్స్ కాపీలు ఇచ్చిన చరిత్ర రేవంత్‌ది అని విమర్శించారు. గురువారం సభలో తప్పులు, అబద్ధాలు మాట్లాడినందుకు ఆయన ముక్కు నేలకు రాయాలని డిమాండ్ చేశారు. తమపై ఎన్ని నిరాధార ఆరోపణలు చేసినా, ప్రజల తరఫున ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని హరీశ్ రావు స్పష్టం చేశారు.

చిన్నారుల ప్రాణాలకు డాక్టర్ శివరంజని భరోసా!

న్యూస్ డెస్క్, 20 నవంబర్ (ఇది కద నిజం): తమ బిడ్డ ప్రాణాలను కాపాడే ఔషధం అందుబాటులో ఉన్నప్పటికీ, దాని ధర కోట్లలో ఉండటంతో కొనుగోలు చేయలేక నిస్సహాయ స్థితిలో ఉన్న తల్లిదండ్రుల వేదన వర్ణనాతీతం. అలన్-హెర్నన్-డడ్లీ సిండ్రోమ్ అనే అత్యంత అరుదైన జన్యుపరమైన వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కుటుంబాల పరిస్థితి సరిగ్గా ఇలాగే ఉండేది. ఈ వ్యాధి నివారణకు ఉపయోగించే టిరాట్రికోల్' అనే ఔషధం యొక్క ఒక సంవత్సరం సరఫరా ఖర్చు గతంలో దాదాపు రూ.9 కోట్లు ఉండేది. అయితే, హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ పీడియాట్రిషియన్ డాక్టర్ శివరంజని సంతోష్ అవిశ్రాంత కృషి వల్ల యాక్సెస్ టు మెడిసిన్స్ ఇండియా సంస్థ సహకారంతో ఇప్పుడు ఈ అసాధ్యం సుసాధ్యమైంది. రూ.9 కోట్లు పలికే ఈ ఔషధం ధరను ఏకంగా రూ.2.5 లక్షలకు తగ్గించడంలో వారు అద్భుత విజయం సాధించారు.

ఏడుగురు చిన్నారులకు ఫ్రీగా పంపిణీ..

అయితే, అలన్-హెర్నన్-డడ్లీ సిండ్రోమ్ వ్యాధి మెడిసన్ ధర తగ్గించడమే కాకుండా, ఈ వ్యాధితో పోరాడుతున్న ఏడుగురు చిన్నారులకు ఒక సంవత్సరం పాటు సరిపడా 'టిరాట్రికోల్' మందులను పూర్తిగా ఉచితంగా అందించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. నవంబర్ 30న ఈ ఏడుగురు చిన్నారుల కుటుంబాలకు ఈ ఔషధాలను అందజేయనున్నారు.

అలన్-హెర్నన్-డడ్లీ సిండ్రోమ్ అంటే..

ఇది ప్రధానంగా మగపిల్లలలో కనిపించే అత్యంత అరుదైన జన్యుపరమైన నాడీ సంబంధిత వ్యాధి. ఈ వ్యాధి సోకిన చిన్నారులలో కండరాల బలహీనత, శారీరక, మానసిక ఎదుగుదల లోపం వంటి తీవ్రమైన సమస్యలు తలెత్తుతాయి. దీనికి 'టిరాట్రికోల్' ఔషధం ఎంతో కీలకమైన చికిత్సగా పనిచేస్తుంది. భారీ ఖర్చు కారణంగా చికిత్సకు దూరమైన ఎన్నో కుటుంబాలకు, ఒక వైద్యురాలి పట్టుదల, సేవా దృక్పథం నేడు కొత్త ఆశలను చిగురింపజేసింది. డాక్టర్ శివరంజని సంతోష్ చేసిన ఈ ప్రయత్నంపై సర్వత్రా ప్రశంసలు కురుస్తున్నాయి.

క్యాన్సర్‌పై యుద్ధం.. ప్రజల వద్దకే వైద్యం!



న్యూస్ డెస్క్, 20 నవంబర్ (ఇది కద నిజం): క్యాన్సర్ మహమ్మారిని ప్రాథమిక దశలోనే గుర్తించి, నివారించే లక్ష్యంతో బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ మరో ముందడుగు వేసింది. ఆసుపత్రిలోని 'బసవతారకం క్యాన్సర్ ప్రివెన్షన్ సెంటర్' ఆధ్వర్యంలో రూపొందించిన 'క్యాన్సర్ స్క్రీనింగ్ స్టాఫ్ వాహనాన్ని' సంస్థ చైర్మన్ నందమూరి బాలకృష్ణ శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'క్యాన్సర్‌పై పోరాటంలో ముందస్తు గుర్తింపు, నివారణ అత్యంత కీలకం. ఈ నూతన వాహనం ద్వారా మా వైద్య బృందాలు మరింత మంది ప్రజలకు, ముఖ్యంగా వైద్య సదుపాయాలు అందుబాటులో లేని మారుమూల మరియు వెనుకబడిన ప్రాంతాలకు చేరువవుతాయి. క్యాన్సర్‌పై అవగాహన కల్పించడంతో పాటు, స్క్రీనింగ్ సేవలను నేరుగా ప్రజల వద్దకే తీసుకెళ్లడం దీని ప్రధాన ఉద్దేశం' అని పేర్కొన్నారు.

సేవలు మరింత బలోపేతం..

ఈ సేవా కార్యక్రమానికి తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధుల ద్వారా నిరంతరం అండగా నిలుస్తున్న 'మానవీయ డెవలప్‌మెంట్ అండ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్' యాజమాన్యానికి ఆసుపత్రి తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గత ఏడాది మానవీయ సంస్థ అందించిన ఆర్థిక సహకారంతో ఆసుపత్రిలో 'పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్' ఏర్పాటు చేశామని, ఈ ఏడాది స్క్రీనింగ్ వాహనానికి సహకరించడం వల్ల తమ కమ్యూనిటీ సేవలు మరింత బలోపేతం అవుతాయని వివరించారు. ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాలకు నిరంతరం మద్దతు ఇస్తున్న మానవీయ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గౌరీ శంకర్, సీనియర్ మేనేజర్ (సీఎస్ఆర్) మాధవి పోతే, మేనేజర్ (సీఎస్ఆర్) సరస్వతి ప్రదీప్‌లకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

ఆరోగ్య సంరక్షణ అందరి హక్కు..

ఆర్థిక ఇబ్బందులు లేదా సరైన సదుపాయాలు లేకపోవడం వల్ల ఏ ఒక్కరూ సకాలంలో క్యాన్సర్ చికిత్సకు దూరం కాకూడదన్నదే తమ బలమైన సంకల్పమని ఆసుపత్రి ప్రతినిధులు స్పష్టం చేశారు. వ్యాధి ముదరకముందే వైద్య సేవలు ప్రజలకు చేరాలనే లక్ష్యంతో 'స్క్రీనింగ్‌ను ప్రజల వద్దకు తీసుకెళ్దాం.. ముందస్తు గుర్తింపుతో కొత్త ఆశలు నింపుదాం' అనే నినాదంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు సభ్యులు జె.ఎస్.ఆర్. ప్రసాద్, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ టి. సుబ్రహ్మణ్యేశ్వర రావు, అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ కె. కల్పనా రఘునాథ్, చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ ఆళ్వార్ నారాయణన్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ రావి శ్రీనివాస రావు, డిప్యూటీ డైరెక్టర్ (అకడమిక్స్) డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, ఇతర వైద్యులు మరియు బసవతారకం క్యాన్సర్ ప్రివెన్షన్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

రేయ్.. చేతులు నరికేస్తా! కేఏ పాల్ వార్నింగ్!

న్యూస్ డెస్క్, 20 నవంబర్ (ఇది కద నిజం): తెలంగాణలో రేవంత్ రెడ్డి సీఎం అయ్యాక క్రైస్తవులపై, దళితులపై, చర్చీలపై దాడులు పెరిగిపోయాయని ప్రజాశాంతి పార్టీ అధినేత కేఏ పాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల ఇద్దరు యువతులపై హైదరాబాద్‌లో జరిగిన దాడిపై పాల్ స్పందించారు. ఈ ఘటన జరిగి రెండు నెలలు అవుతోందని పోలీసులు ఏం చేశారని ప్రశ్నించారు. ఎవ్వరినీ వదిలిపెట్టనని తాట తీస్తానంటూ వార్నింగ్ ఇచ్చారు. రేవంత్ రెడ్డి మూడు నెలల తరవాత సీఎంగా ఉండడు అని వ్యాఖ్యానించారు. అవసరమైతే తాను బీజేపీతో పొత్తు పెట్టుకుంటానని, కాంగ్రెస్ లేదా బీఆర్ఎస్, టీఆర్ఎస్ లతో కూడా పొత్తు పెట్టుకుంటానని చెప్పారు.

తాను అధికారంలోకి వస్తే అప్పులు తీరుతాయని చెప్పారు. ఇరాన్ ప్రెసిడెంట్, అమెరికా ప్రెసిడెంట్ లాంటి వాళ్లు తన చుట్టూ తిరుగుతున్నారని అన్నారు. యువత కలిసి రావాలని కలిసి పోరాడదామని పిలుపునిచ్చారు. యువతులపై దాడి చేసిన వ్యక్తులు రెండు రోజుల్లోనే బెయిల్ పై బయటకు వచ్చారని మండిపడ్డారు. మరోసారి దళితులపై, అమ్మాయిలపై చేయి వేస్తే అంతు చూస్తానని హెచ్చరించారు. అమ్మాయిలపై చేయి వేస్తే చేతులు తీసేస్తానని మండిపడ్డారు.

రూ.40 కోట్ల కుంభకోణం..రేఖానాయక్‌కు ఉచ్చు!

మొదటి పేజీ తరువాయి

9,639.962 మెట్రిక్ టన్నుల బియ్యం కొరత..

ప్రభుత్వ ఆదేశాల మేరకు మిల్లింగ్ కోసం అప్పగించిన ధాన్యం నిల్వల విషయంలో భారీగా అవకతవకలు జరిగినట్లు గతంలోనే వెలుగులోకి వచ్చింది. సత్తెనపల్లిలోని రేఖానాయక్‌కు చెందిన 'ఏఆర్ఎస్ ఇండస్ట్రీస్' రైస్ మిల్లుకు ప్రభుత్వం కేటాయించిన ధాన్యంలో ఏకంగా 9,639.962 మెట్రిక్ టన్నుల కొరత ఉన్నట్లుగా పౌరసరఫరాల శాఖ తనిఖీల్లో తేలింది. దీని విలువ సుమారు రూ.40.96 కోట్లుగా అధికారులు నిర్ధారించారు. అయితే, నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ ధాన్యాన్ని పక్కదారి పట్టించారనే ఆరోపణలపై గత ఆగస్టులోనే రేఖానాయక్‌పై బీఎన్ఎస్ సెక్షన్లు 316(2), 316(5), 318(4)తో పాటు నిత్యావసర సరుకుల చట్టం కింద కేసు నమోదైంది. భారీ మొత్తంలో ప్రభుత్వ నిధులు, ధాన్యం గోల్‌మాల్ కావడంతో ఈ వ్యవహారంలో మనీలాండరింగ్ జరిగినట్లుగా ఈడీ అధికారులు అనుమానిస్తున్నారు. అక్రమంగా తరలించిన ధాన్యం ద్వారా సమకూరిన నగదు ఎక్కడికి వెళ్లింది..? ఆర్థిక లావాదేవీలు ఎలా జరిగాయి? అనే కోణంలో ఈడీ బృందాలు సోదాలు జరుపుతున్నాయి.

ఖానాపూర్‌లో హై టెన్షన్ వాతావరణం.. మరోవైపు, దర్యాప్తు వేగవంతం కావడం, రేఖానాయక్ అరెస్ట్‌కు రంగం సిద్ధమవుతోందన్న ప్రచారం నేపథ్యంలో ఖానాపూర్‌లో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. విజిలెన్స్ అధికారులతో పాటు భారీగా పోలీసు బలగాలు రేఖానాయక్ ఇంటికి చేరుకోవడంతో స్థానికంగా కలకలం రేగింది. విషయం తెలుసుకున్న రేఖానాయక్ అనుచరులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో ఆమె నివాసం వద్దకు చేరుకోవడంతో ఖానాపూర్ పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు అప్రమత్తమై, బందోబస్తును మరింత కట్టుదిట్టం చేసి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.నిర్మల్ జిల్లా ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకురాలు రేఖానాయక్ చుట్టూ సీఎంఆర్ కుంభకోణం ఉచ్చు బిగుస్తోంది. సుమారు రూ.40.96 కోట్ల విలువైన ప్రభుత్వ ధాన్యం మాయమైన కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, విజిలెన్స్ అధికారులు శుక్రవారం సంయుక్తంగా రంగంలోకి దిగారు. రేఖానాయక్ నివాసాలతో పాటు మొత్తం రెండు చోట్ల ఏకకాలంలో అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహిస్తూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

కాంగ్రెస్‌లో భారీ నియామకాలు!

మొదటి పేజీ తరువాయి

తెలుగు రాష్ట్రాలు: తెలంగాణకు సచిన్ సావంత్, సైమన్ అలెక్స్‌లను ఏఐసీసీ కార్యదర్శులుగా నియమించగా; ఆంధ్రప్రదేశ్, అండమాన్ ఁ నికోబార్ దీవులకు సెంథమిళ్ అరసు, వి. శంకర్‌లకు బాధ్యతలు అప్పగించారు.

దక్షిణాది రాష్ట్రాలు: కర్ణాటకకు నెట్టా డిసౌజా, మోహన్ జోషి, సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ, అడ్వకేట్ ఎస్. శరత్; తమిళనాడు, పుదుచ్చేరిలకు నివేదిత్ అల్వా, జంగా గౌతమ్, వెంకటేశ్వర్; కేరళ, లక్షద్వీప్‌లకు మయూర ఎస్. జయకుమార్, గణేష్ కుమార్ యాదవ్ నియమితులయ్యారు.

ఉత్తరాది, ఇతర రాష్ట్రాలు: ఉత్తరప్రదేశ్‌కు అభిషేక్ దత్, వరుణ్ చౌదరి, కునాల్ చౌదరి, జగదీష్ చందర్ జాంగిడ్, అబ్దుల్ హన్నన్, సంజీవ్ ఆర్య; ఉత్తరాఖండ్‌కు మనోజ్ యాదవ్, సురేందర్ శర్మ, భీమ్ కుమార్; పంజాబ్‌కు హీనా కవారే, రవీంద్ర దాల్వి, సూరజ్ సింగ్ ఠాకూర్, డాక్టర్ రాజ్ కుమార్ మౌర్య; హర్యానాకు దీపక్ రాథోడ్, సునీల్ అహిరే; హిమాచల్ ప్రదేశ్, చండీగఢ్‌లకు కమల్ కాంత్ శర్మ, డాక్టర్ రాహుల్ రాజ్‌ఖర్; జమ్మూ కాశ్మీర్, లడఖ్‌లకు ధీరజ్ గుర్జర్, సుశీల్ కుమార్ పాసి; ఢిల్లీకి డానిష్ అబ్రార్ నియమితులయ్యారు.

పశ్చిమ, మధ్య భారత రాష్ట్రాలు: గుజరాత్‌కు రామకిషన్ ఓఝా, సుభాషిణి యాదవ్, హేమ్ సింగ్ షెకావత్, నరేష్ ఠాకూర్; మహారాష్ట్రకు యు.బి. వెంకటేష్, రెహానా రయాజ్ చిస్తీ, ఎఫ్.హెచ్. జక్కప్పనవర్, యోగేందర్ యోగి; రాజస్థాన్‌కు విశ్వ విజయ్ సింగ్, పోర్లక్ ఖర్తే, డాక్టర్ పాలక్ వర్మ, మనోజ్ బాగ్రీ; మధ్యప్రదేశ్‌కు నీతూ వర్మ సోయిన్, పాల్ భాయ్ అంబాలియా, డాక్టర్ అజయ్ కుమార్ పాశ్వాన్, ఓంవీర్ యాదవ్; ఛత్తీస్‌గఢ్‌కు జితేంద్ర బఘేల్, హర్నామ్ సింగ్; గోవా, దాద్రా ఁ నగర్ హవేలీ, డామన్ ఁ డయ్యాలకు డాక్టర్ అంజలి నింబాల్కర్‌లకు బాధ్యతలు అప్పగించారు.

తూర్పు, ఈశాన్య రాష్ట్రాలు: బీహార్‌కు ప్రదీప్ నర్వాల్, ప్రొఫెసర్ ప్రకాష్ సోనావానే, మహబూబ్ పాషా; జార్ఖండ్‌కు భూపేంద్ర మరావి, అవనీష్ కాజ్లా; పశ్చిమ బెంగాల్‌కు అబ్దుల్ ఖలీక్, దేబాశిష్ పట్నాయక్, గుంజన్ పటేల్; ఒడిశాకు జెట్టి కుసుమ కుమార్, పూర్ణచంద్ర పాధి; అస్సోంకు మనోజ్ చౌహాన్, బాబీ భగత్, ఇఫ్తేకర్ అహ్మద్; మేఘాలయ, మిజోరం, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాలకు అనిల్ ఎ. థామస్, సుశాంత చక్రవర్తి, జెనాబ్ చందేల్; మణిపూర్, త్రిపుర, సిక్కిం, నాగాలాండ్ రాష్ట్రాలకు సరితా లైట్‌ఫ్లాంగ్, అమిత్ బావా సైనీ, దుంగార్ రామ్ గెదార్‌లను ఏఐసీసీ కార్యదర్శులుగా నియమించారు.

విభాగాల వారీగా బాధ్యతలు.. జాయింట్ ట్రెజరర్ (ఆస్తులు, ప్రాపర్టీస్) విభాగానికి నీలేష్ పటేల్, నితిన్ కుంభాల్కర్‌లను నియమించగా; పరిపాలన (అడ్మినిస్ట్రేషన్) విభాగ బాధ్యతలను సుశాంత్ మిశ్రా, మనోజ్ త్యాగిలకు అప్పగించారు. అలాగే శిక్షణ, సందేశ్ విభాగానికి సంతోష్ కోల్కుండ; ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ ఁ విదేశీ వ్యవహారాల విభాగానికి డాక్టర్ ఆరతి కృష్ణ నియమితులయ్యారు. మరోవైపు, ఇప్పటివరకు ఏఐసీసీ కార్యదర్శులు, సంయుక్త కార్యదర్శులుగా పనిచేసి బాధ్యతల నుంచి తప్పుకుంటున్న అంబా ప్రసాద్, బి.ఎం. సందీప్, చేతన్ చౌహాన్, చిరంజీవ్ రావు, క్రిస్టోఫర్ తిలక్, దేవేంద్ర యాదవ్, దివ్య మదెర్నా, మన్సూర్ అలీ ఖాన్ అందించిన సేవలను పార్టీ అభినందించింది.

కార్తీక దీపానికి పరిమిత అనుమతి!

మొదటి పేజీ తరువాయి

రాబోయే సంవత్సరాల్లో కూడా ఇదే తరహాలో దీపం వెలిగించేందుకు ఇది ప్రాతిపదిక కాబోదని ధర్మాసనం తేల్చిచెప్పింది. ఈ రాతి స్తంభం చారిత్రాత్మకంగా మతపరమైన ఆచారాలకు వేదిక అని గానీ, అక్కడ దీపం వెలిగించడం తప్పనిసరి మతాచారమని గానీ తాము ఎటువంటి నిర్ధారణకు రావడం లేదని కోర్టు పేర్కొంది.

సాధారణ ప్రజలకు నో ఎంట్రీ.. కఠిన నిబంధనలు:

జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ విపుల్ ఎం పంచోలిలతో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాలు జారీ చేస్తూ కఠిన నిబంధనలు విధించింది. ఈ వేడుక కోసం కేవలం దేవస్థానం (ఆలయ పరిపాలన) గుర్తించిన ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులకు మాత్రమే అనుమతి ఉంటుందని, సాధారణ ప్రజలను దీపతూణ్ వద్దకు అనుమతించరాదని స్పష్టం చేసింది. వేడుక సమయంలో ఎటువంటి ఊరేగింపులు, బహిరంగ సభలు, నినాదాలు లేదా ప్రదర్శనలకు అనుమతి లేదని తేల్చిచెప్పింది.

భద్రతా ఏర్పాట్లు.. అవసరమైతే సీఐఎస్ఎఫ్ మోహరింపు:

అధికారులు తగిన భద్రతా ఏర్పాట్లు చేయాలని ఆదేశించిన ధర్మాసనం, అవసరమైతే కేంద్ర పారిశ్రామిక భద్రతా దళాన్ని మోహరించేందుకు కూడా అనుమతినిచ్చింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 25, 26 కింద మతపరమైన హక్కుల పరిధి సహా ఈ కేసులో అనేక ముఖ్యమైన అంశాలు ముడిపడి ఉన్నాయని, వాటిని తగిన సమయంలో విచారిస్తామని కోర్టు తెలిపింది.

ఇరు పక్షాల ప్రయోజనాలను సమతుల్యం చేసేందుకే మధ్యంతర ఉపశమనం:

మద్రాస్ హైకోర్టు సింగిల్ బెంచ్, డివిజన్ బెంచ్ రెండూ వివాదాస్పద ప్రదేశంలో వేడుక నిర్వహణకు అనుమతించిన విషయాన్ని మధ్యంతర ఉపశమనం కోసం పరిగణనలోకి తీసుకున్నట్లు సుప్రీంకోర్టు పేర్కొంది. అదే సమయంలో, హైకోర్టు తీర్పులోని కారణాలను తాము సమర్థిస్తున్నట్లు భావించరాదని స్పష్టం చేసింది. నవంబర్ 24న పండుగ నిర్వహించే అవకాశాన్ని ఇప్పుడు నిరాకరిస్తే, ఆ తర్వాత ఇచ్చే తీర్పు ద్వారా దానిని తిరిగి పొందలేమని, అలాగే ఒకసారి వేడుక జరిగితే దానిని వెనక్కి తీసుకోలేమని వ్యాఖ్యానించిన కోర్టు, ఇరు పక్షాల ప్రయోజనాలను సమతుల్యం చేసేందుకే పరిమిత అనుమతి ఇస్తున్నట్లు వివరించింది. 06.01.2026 నాటి హైకోర్టు డివిజన్ బెంచ్ తీర్పులోని 1 నుండి 140 పేరాల వరకు ఉన్న పరిశీలనలపై తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు స్టే విధిస్తున్నట్లు ప్రకటించింది.

నోడల్ అధికారిగా జిల్లా కలెక్టర్.. మూడు రోజుల్లో నివేదిక:

నవంబర్ 24న దేవస్థానం ఏర్పాటు చేసే పరిమిత బృందం ద్వారా దీపతూణ్ వద్ద దీపం వెలిగించాలని కోర్టు ఆదేశించింది. ఆలయ కార్యనిర్వహణాధికారి, ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా, మదురై పోలీస్ కమిషనర్‌లతో సంప్రదించి ఆ బృందంలో ఎంతమంది ఉండాలో మదురై జిల్లా కలెక్టర్ నిర్ణయించాలని, కలెక్టరే నోడల్ అధికారిగా వ్యవహరించాలని సూచించింది. వేడుక సమయం, మార్గాన్ని జిల్లా యంత్రాంగం నిర్ణయించాలని, దీపం వెలిగించిన వెంటనే ఆ బృందం అక్కడి నుంచి వెళ్లిపోవాలని ఆదేశించింది. అక్కడ ఎటువంటి నిర్మాణాలు, మార్పులు లేదా తవ్వకాలు జరపరాదని, దర్గా మరియు మసీదు కార్యకలాపాలకు ఎటువంటి ఆటంకం కలిగించరాదని స్పష్టం చేసింది. పండుగ ముగిసిన మూడు రోజుల్లోగా జిల్లా కలెక్టర్ నివేదిక సమర్పించాలని ఆదేశించింది.

ఏపీఎండీసీ ఐపీవోకు చంద్రబాబు గ్రీన్ సిగ్నల్!



న్యూస్ డెస్క్, 20 నవంబర్ (ఇది కద నిజం): ఆంధ్రప్రదేశ్‌లో ఖనిజ వనరుల వినియోగం, మైనింగ్ రంగ అభివృద్ధిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి సారించారు. మైనింగ్ శాఖపై సమీక్ష నిర్వహించిన సీఎం.. రాష్ట్రంలోని ఖనిజ సంపదను సమర్థవంతంగా వినియోగించుకోవడంతో పాటు ఆదాయాన్ని పెంచేలా కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఏపీఎండీసీ పరిధిలో ఉన్న ఖనిజ వనరుల విలువ సుమారు రూ.7.8 లక్షల కోట్లుగా ఉన్నట్లు సమీక్షలో వెల్లడైంది. ఏపీఎండీసీని మరింత బలోపేతం చేసే దిశగా వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి సంస్థను స్టాక్ మార్కెట్‌లో లిస్టింగ్ చేసి ఐపీవోకు తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఏపీఎండీసీ ఈక్విటీ విలువను రూ.86,290 కోట్లుగా అంచనా వేశారు. దీనికి అనుగుణంగా అవసరమైన కార్యాచరణను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు సీఎం చంద్రబాబు.

అలాగే రాష్ట్రంలో అరుదైన ఖనిజ వనరుల అన్వేషణ, అభివృద్ధి కోసం ఏపీ రేర్ ఎర్త్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటుకు సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో కీలక ఖనిజ వనరులపై పట్టు సాధించేందుకు విదేశాల్లో ఉన్న కీలక ఖనిజ మైనింగ్ ఆస్తులను కొనుగోలు చేసే అవకాశాలను పరిశీలించాలని, అందుకు అనుగుణంగా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. రాష్ట్రంలో ఖనిజ నిక్షేపాల గుర్తింపు కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతను వినియోగిస్తున్నారు. ఇందులో భాగంగా ఏఐ ఆధారంగా 582 ఖనిజ అన్వేషణ ప్రాంతాలను గుర్తించారు. మరోవైపు రాష్ట్రంలోని మూడు బొగ్గు బ్లాకుల్లో మొత్తం 1,774.6 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నట్లు సమీక్షలో వెల్లడైంది. ఇక, మైనింగ్ రంగం ద్వారా ప్రభుత్వ ఆదాయాన్ని మరింత పెంచేందుకు పెండింగ్‌లో ఉన్న క్వారీ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఈ దరఖాస్తుల పరిష్కారం ద్వారా సుమారు రూ.400 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నారు. ఖనిజ వనరుల అన్వేషణ నుంచి మైనింగ్ కార్యకలాపాలు, అంతర్జాతీయ పెట్టుబడుల వరకు సమగ్ర ప్రణాళికతో ముందుకెళ్లాలని సూచించారు సీఎం నారా చంద్రబాబు నాయుడు.

కేసీఆర్‌తో భేటీకి సిద్ధం..రేవంత్ కీలక వ్యాఖ్యలు!



న్యూస్ డెస్క్, 20 నవంబర్ (ఇది కద నిజం): మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ ప్రతి పేదవాడు అభివృద్ధి చెందాలని భావించారని, దేశ తొలి ప్రధాని నెహ్రూ విద్య, సాగునీటి రంగాలకు ప్రాధాన్యత ఇచ్చి అనేక విద్యా సంస్థలు, ప్రాజెక్టులు నిర్మించారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించింది కాంగ్రెస్ పార్టీయేనని, పీవీ నరసింహారావు లిబరలైజేషన్ పాలసీని తీసుకువస్తే మన్మోహన్ సింగ్ వాటిని కొనసాగించారని తెలిపారు. కానీ, మోడీ ప్రధాని అయ్యాక ఈడీ, సీబీఐ, ఇన్‌కమ్ ట్యాక్స్ సంస్థలను ముందుకు తీసుకువచ్చారని, జాతి, మతం, భాష పేరుతో విభేదాలు సృష్టించారని ఆరోపించారు. 12 ఏళ్లలో మోడీ పెట్టిన భయాన్ని యువత 12 రోజుల్లో తీసివేసిందని అన్నారు. ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న పేదల ఓటు హక్కును తొలగించడానికి మోడీ ప్రయత్నిస్తున్నారని, రాహుల్ గాంధీ చేపట్టిన 'ఓట్ చోర్.. గద్దీ చోర్' నినాదానికి అందరి మద్దతు లభిస్తోందని పేర్కొన్నారు.

ప్రధాని మోడీ ఎన్నిసార్లు విదేశాలకు వెళ్లారో లెక్క లేదని, ఆయన 'విజిటింగ్ ప్రైమ్ మినిస్టర్ ఆఫ్ ఇండియా'గా మారారని ఎద్దేవా చేశారు. మోడీకి ముందున్న ప్రధాన మంత్రులు రూ. 53 లక్షల కోట్ల అప్పు చేస్తే, ఈ 12 ఏళ్లలో ప్రధాని మోడీ ఏకంగా రూ. 120 లక్షల కోట్ల అప్పులు చేశారని విమర్శించారు. మోడీ ప్రభుత్వ నిధులన్నీ అదానీ జేబులో వేస్తుంటే, తాను అదానీ జేబులో నుంచి నిధులు తీసుకువచ్చి తెలంగాణలో అభివృద్ధి చేస్తున్నానని, యువతకు ఉపాధి కల్పిస్తున్నానని చెప్పారు. అదానీ ప్రపంచ కుబేరుల్లో రెండో స్థానానికి ఎలా వచ్చారని ప్రశ్నించారు. బీజేపీ ఎప్పుడూ అబద్ధాలే మాట్లాడుతుందని, స్వాతంత్ర్యం తెచ్చిన పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని, ప్రజలు ఉన్నన్ని రోజులు, మరో వెయ్యి ఏళ్లు కాంగ్రెస్ ఉంటుందని స్పష్టం చేశారు.

ప్రభుత్వ అవసరాల కోసం ఎవరినైనా కలుస్తానని, అవసరమైతే కేసీఆర్‌ను కూడా కలుస్తానని రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రధాని మోడీ ఎవరికీ చెప్పకుండా పాకిస్థాన్‌కు వెళ్లి బిర్యానీ తిని వచ్చారని, అలాంటప్పుడు తాను వెళ్లి మోడీని కలిస్తే తప్పేమిటని ప్రశ్నించారు. 8,000 మంది క్రీడాకారులు పాల్గొనే 'ఖేలో ఇండియా' కార్యక్రమం కోసం ప్రధానిని కలిసి ఆహ్వానించామని, డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో జరిగే 'తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'కు రావాలా లేదా అన్నది మోడీ ఇష్టమని, తాను తన మర్యాద చూపించానని అన్నారు. తన ప్రస్థానం ఏబీవీపీ నుంచే ప్రారంభమైందని.. అది తాను దాచిపెట్టడం లేదని సీఎం రేవంత

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
శనివారం 21-11-2026

పిట్లం భూలక్ష్మమ్మ-పాపమ్మ మందిరంలో ఘనంగా కార్తీక దీపోత్సవం

భక్తిశ్రద్ధలతో దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్న మహిళలు





ఇది కద నిజం ,ఉమ్మడి నిజాంబాద్ జిల్లా నవంబర్ 20. పిట్లం మండల కేంద్రంలోని భూలక్ష్మమ్మ-పాపమ్మ మందిరంలో కార్తీక మాసం సందర్భంగా శుక్రవారం సాయంత్రం కార్తీక దీపోత్సవాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని ప్రత్యేకంగా దీపాలు వెలిగించి అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కులను చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణం దీపాల వెలుగులతో భక్తిమయంగా మారింది. మహిళలు భక్తి పారవశ్యంతో కార్తీక దీపోత్సవంలో పాల్గొన్నారు.

యాదగిరిగుట్టలో విషాదం

గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

18వ తేదీ రాత్రి ప్రమాదం.. చికిత్స పొందుతూ శుక్రవారం తుదిశ్వాస

మానవత్వం చాటుకుని ఆసుపత్రికి తరలించిన యాదగిరిగుట్ట పోలీసులు



యాదగిరిగుట్ట: పట్టణంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి పాదాల సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ గుర్తుతెలియని వృద్ధుడు (సుమారు 65--70 ఏళ్లు) చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ నెల 18వ తేదీ రాత్రి సుమారు 8:30 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాదం జరిగిన సమయంలో అదే మార్గంలో వెళ్తున్న యాదగిరిగుట్ట పోలీస్ స్టేషన్ కానిస్టేబుళ్లు సంజయ్, లక్ష్మణ్ రక్తపు మడుగులో పడి ఉన్న వృద్ధుడిని గమనించారు. తల, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలైన అతన్ని వెంటనే 108 అంబులెన్స్ సహాయంతో భువనగిరి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి రిఫర్ చేశారు. కానిస్టేబుల్ నవీన్ బాధితుడిని భువనగిరి నుండి గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్లి అడ్మిట్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో శుక్రవారం (నవంబర్ 20) ఉదయం 11:26 గంటలకు వృద్ధుడు మృతి చెందినట్లు గాంధీ ఆసుపత్రి డ్యూటీ డాక్టర్ ధృవీకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు యాదగిరిగుట్ట ఎస్‌హెచ్‌ఓ ఒక ప్రకటనలో తెలిపారు.

యాదగిరిగుట్ట దేవస్థానం ధర్మకర్తల మండలి నాల్గవ సమావేశం

కోటి పుష్పార్చనలో పాల్గొన్న చైర్మన్ మన్నె సత్యనారాయణ రెడ్డి, సభ్యులు

పదవీ విరమణ చేయనున్న ఎక్స్-అఫీషియో సభ్యుడు వెంకటాచార్యులకు ఘన సన్మానం



ఇది కద నిజం ,యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం ధర్మకర్తల మండలి నాల్గవ సమావేశం శుక్రవారం దేవస్థాన సమావేశ మందిరంలో నిర్వహించారు. అంతకుముందు ధర్మకర్తల మండలి చైర్మన్ మన్నె సత్యనారాయణ రెడ్డి, సభ్యులు శ్రీ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయంలో జరుగుతున్న కోటి పుష్పార్చన కార్యక్రమంలో పాల్గొన్నారు. మధ్యాహ్నం 3:00 గంటలకు వేద పండితుల మంత్రోచ్ఛారణ, ఆశీర్వచనాలతో సమావేశాన్ని సంప్రదాయబద్ధంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈ నెలలో పదవీ విరమణ చేయనున్న దేవస్థాన ఎక్స్-అఫీషియో సభ్యులు కాండూరి వెంకటాచార్యులను ధర్మకర్తల మండలి తరఫున ఘనంగా సన్మానించారు. ఆలయ అభివృద్ధికి, ధార్మిక కార్యక్రమాలకు ఆయన అందించిన సేవలను సభ్యులు కొనియాడారు. చైర్మన్ మన్నె సత్యనారాయణ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కార్యనిర్వహణాధికారి భవాని శంకర్, ధర్మకర్తల మండలి సభ్యులు విజేందర్ గౌడ్, ఈశ్వరమ్మ యాదవ్, చిల్లప్ప రాజం విజయశీలం, గుండా మల్లయ్య, కే. లక్ష్మీనారాయణ, ఎక్స్-అఫీషియో సభ్యులు కాండూరి వెంకటాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రిలో వైభవంగా కోటి పుష్పార్చన

మాడవీధులలో శోభాయమానంగా సాగిన స్వామివారి ఊరేగింపు

రాష్ట్ర ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించిన ఆలేరు ఎమ్మెల్యే



ఇది కద నిజం ,యాదగిరిగుట్ట: కార్తీక మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి సన్నిధిలో సహస్రనామావళి సహిత కోటి పుష్పార్చన కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ వేడుకలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు గోవింద నామస్మరణలతో మార్మోగాయి. అంతకుముందు అర్చకులు, వేద పండితులు అంతరాలయంలో స్వామివారికి ప్రత్యేక ఆరాధనలు నిర్వహించారు. అనంతరం సుగంధ పుష్పాలతో అలంకరించిన స్వామివారిని వేదమంత్రోచ్ఛారణలు, మేళతాళాల నడుమ మాడవీధుల మీదుగా ఊరేగించారు. ఈ ఊరేగింపులో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య పుష్పాలతో భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. అనంతరం కోటి పుష్పార్చన మండపానికి చేరుకున్న స్వామివారికి సహస్రనామావళి పారాయణంతో అర్చకులు పుష్పార్చన నిర్వహించగా, ఎమ్మెల్యే మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య మాట్లాడుతూ పవిత్రమైన కార్తీక మాసంలో నిర్వహించే కోటి పుష్పార్చన వంటి కార్యక్రమాలు భక్తుల్లో ఆధ్యాత్మిక చింతనను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. యాదాద్రి క్షేత్రం తెలంగాణ రాష్ట్రానికే ఆధ్యాత్మిక కీర్తిప్రతిష్ఠలను తెస్తోందన్నారు. రైతులు, కార్మికులు, మహిళలు, యువతతో పాటు అన్ని వర్గాల ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ ఆలయ వైభవాన్ని మరింత పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు.



స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వైభవంగా ఏకాదశి ప్రత్యేక పూజలు

- స్వామి, అమ్మవార్లకు నవ కలశ పంచామృతాభిషేకం, తోమాల సేవ
- నిత్య కళ్యాణం, తిరువీధి ఉత్సవంతో ఆధ్యాత్మిక శోభ..3వేల మందికి అన్నప్రసాదం





ఇది కద నిజం ,భువనగిరి స్వర్ణగిరి): కార్తీక మాస శుక్ల పక్ష ఏకాదశి, శుక్రవారాన్ని పురస్కరించుకుని స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్య క్షేత్రంలో ప్రత్యేక పూజలు, సేవలు అత్యంత వైభవంగా జరిగాయి. బ్రహ్మ ముహూర్తంలో అర్చకులు స్వామివారికి సుప్రభాత సేవ నిర్వహించగా, ప్రాతఃకాలంలో శ్రీ వేంకటేశ్వర స్వామి, శ్రీ పద్మావతి అమ్మవార్లకు నవ కలశ పంచామృతాభిషేకం శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం ఉదయం 5:30 గంటలకు మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ తోమాల సేవ నిర్వహించి, మేల్ చాట్ వస్త్ర సేవలో పట్టు పీతాంబరాలను సమర్పించారు.

ఉదయం ఆలయ ప్రాంగణంలోని అష్టలక్ష్మి మంటపంలో కార్తీక దామోదర హవనం, వైభవ మంటపంలో సత్యనారాయణ వ్రతాలను అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఉదయం 10:30 గంటలకు సుగంధ భరిత పుష్పమాలలు, పట్టు వస్త్రాలతో అలంకరించిన స్వామివారికి వైభవోత్సవ మండపంలో వేదమంత్రోచ్ఛారణల మధ్య నిత్య కళ్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఈ వేడుకను తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. నిత్యాన్నదాన కార్యక్రమంలో భాగంగా సుమారు 3 వేల మందికి పైగా భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

సాయంత్రం సంధ్యా సమయంలో ఆలయ ధ్వజస్తంభం వద్ద మోక్ష నారాయణ దీపాన్ని వెలిగించారు. రాత్రి 6:30 గంటలకు భక్తుల గోవింద నామస్మరణల మధ్య మాడవీధులలో స్వామివారి తిరువీధి ఉత్సవం శోభాయమానంగా సాగింది. అనంతరం సహస్ర దీప కాంతుల నడుమ ఊయలలో ఆసీనులైన స్వామివారిని భక్తులు దర్శించుకుని తరించారు. రాత్రి 7:30 గంటలకు శ్రీ పద్మావతి అమ్మవారికి సహస్ర కుంకుమార్చన సేవను అర్చకులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.



యాదగిరిగుట్ట దేవస్థానంలో వైభవంగా ప్రారంభమైన సహస్రనామావళి సహిత కోటి పుష్పార్చన

పాల్గొన్న ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య



ఇది కద నిజం ,యాదగిరిగుట్ట, నవంబర్ 20: యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానంలో నిర్వహిస్తున్న కార్తీక వైభవోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం శ్రీ స్వామివారి సహస్రనామావళి సహిత కోటి పుష్పార్చన కార్యక్రమం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ముందుగా దేవస్థాన అర్చకులు, వేద పండితులు శాస్త్రోక్తంగా అంతరాలయంలో శ్రీ స్వామివారికి ప్రత్యేక పూజలు, ఆరాధనలు నిర్వహించారు. అనంతరం కోటి పుష్పార్చన కోసం భక్తిశ్రద్ధలతో సేకరించిన వివిధ రకాల పుష్పాలను ఆలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసి స్వామివారికి పూజలు నిర్వహించారు. తదుపరి శ్రీ స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి మేళతాళాలు, వేదమంత్రోచ్ఛారణల నడుమ శోభాయమానంగా ఊరేగింపు సేవ నిర్వహించారు. ఈ ఊరేగింపు ఆలయ మాడవీధుల మీదుగా కొనసాగి, అక్కడ ఏర్పాటు చేసిన కోటి పుష్పార్చన మండప ప్రాంగణానికి చేరుకుంది. అనంతరం సహస్రనామావళి పారాయణంతో కోటి పుష్పార్చన పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ పవిత్ర కార్యక్రమంలో వేద పండితులు, వేద విద్యార్థులు, దేవస్థానం సంస్కృత విద్యాపీఠం విద్యార్థులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులు స్వామివారికి సమర్పించేందుకు తీసుకువచ్చిన పుష్పాలను భక్తిశ్రద్ధలతో అందజేసి పుష్పార్చనలో భాగస్వాములయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య, దేవస్థాన కార్యనిర్వహణాధికారి జె. భవానీ శంకర్, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. స్వామివారి ఊరేగింపు సేవలో భాగస్వాములయ్యారు. కార్యక్రమం భద్రతా పరముగా దిగ్విజయ నిర్వహణ గాను స్థానిక డిఎస్పి శ్రీనివాస్ నాయుడు మరియు భాస్కర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ వారి ఆధ్వర్యంలో పటిష్ట భద్రత ఏర్పాట్లు గావింపబడి భక్తులకు విచ్చేయు అతిధులకు ఎటువంటి అసౌకర్యములు కలగకుండా ఏర్పాట్లు కావించబడినవి.కార్తీక మాస పవిత్రతను చాటుతూ, భక్తి పరిమళాలను వెదజల్లేలా నిర్వహిస్తున్న కోటి పుష్పార్చన కార్యక్రమంతో యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.



సంక్షేమ పథకాల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తున్న తీరును చూసి "ఇందిరమ్మ" ఆత్మ కూడా క్షోభిస్తుంది: బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్



కుత్బుల్లాపూర్, 20 నవంబర్ (ఇది కద నిజం): జగద్గిరిగుట్ట డివిజన్

తెలంగాణ ప్రజలను మరో మారు మోసం చేస్తూ "ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా పథకం" పేరుతో ప్రారంభించిన బీమా పథకం అమలు తీరుపై బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ మీడియా సమావేశంలో తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...

ఉన్న బీమా పథకాలను అమలు చేయలేక తెలంగాణ రైతాంగం తో పాటు కల్లుగీత, మత్స్యకారులు, గౌడన్న, నేతన్న, కార్మికులతో పాటు అన్ని వర్గాల ప్రజలను మరో మారు కాంగ్రెస్ ప్రభుత్వంమోసం చేస్తుంది.

కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలను కొనసాగించలేని చేతకాని ప్రభుత్వం ఈ కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రీమియం చెల్పించలేని దుస్థితిలో ఉంది ఈ కాంగ్రెస్ ప్రభుత్వం.

సంక్షేమ పథకాల అమలులో డబ్బులు లేవంటూ చేతులెత్తేసిన ప్రభుత్వం ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపుతూ అబద్ధపు హామీలతో మూడు సంవత్సరాలుగా ప్రజలను మోసం చేస్తున్నారు.

మహిళలకు ఇస్తానన్న 2500 రూపాయలు, వృద్ధులకు 6000 పెన్షన్ అన్నారు, వంద రోజుల్లో 6 గ్యారంటీ, 13 డిక్లరేషన్లను అమలు చేస్తామని చెప్పి మూడు సంవత్సరాలు అవుతున్న సంక్షేమ పథకాలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. కేవలం కాలయాపన చేస్తూ ప్రజలను మరో మారు మభ్య పెట్టేందుకు ఈ ప్రభుత్వం ప్రయత్నిస్తుంది.

ఇందిరమ్మ పేరుతో సంక్షేమ పథకాలను తెచ్చి ఊదరగొడుతున్న ప్రభుత్వం పథకం అమలులో విఫలమవుతూ ఇందిరమ్మ ఆత్మను గోసపెడుతున్నారు.

సొంత కాంట్రాక్ట్ల కోసం, కమిషన్ల కోసం ఈ ప్రభుత్వం నడుస్తుంది తప్పా ప్రజలకు సంక్షేమ పథకాలను అమలుచేయడంలో చిత్తశుద్ధి కనపడటం లేదు.

సంక్షేమ పథకాలను అమలుచేయడం చేతకావడం లేదని సాక్షాతూ కాంగ్రెస్ పార్టీకి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు చేతులెత్తేస్తున్నారు.

ఇందిరమ్మ పేరుతో సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తున్న తీరును చూసి "ఇందిరమ్మ" ఆత్మ కూడా క్షోభిస్తుంది

సంక్షేమ పథకాల అమలుపై బిఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ పార్టీని ప్రశ్నిస్తూనే ఉంటది. ప్రజల పక్షాన పోరాడుతూనే ఉంటది. అని అన్నారు.

విద్యార్థుల్లో చిత్రలేఖనా నైపుణ్యంతో ఒనగూరే ప్రయోజనాలనేకం

ప్రధానోపాధ్యాయురాలు తిరునగరి స్వాతి

తొర్రూరు, 20 నవంబర్ (ఇది కద నిజం): రెవెన్యూ డివిజన్ కేంద్రంలోని అంబేద్కర్



ప్రాథమిక పాఠశాలలో వారంలో ఓ రోజు విరామసమయశీలోనే విద్యార్థులంతా తమ అంతరంగంలోని భావాన్ని పెన్సిల్ లేదా కలంతో, గీతలుగీస్తూ ఓ ఆకారాన్ని సృష్టించడం ద్వారా భావం,ఆలోచన,కళాత్మకత, సృజనాత్మకతలాంటి నైపుణ్యాలు మెరుగవ్వటం మరియు ఏర్చి,కూర్చి ఇంద్రధనస్సును పోలిన సప్తవర్ణాల మేళవింపుతో

శాశ్వత చిత్రాన్ని తన మనోభావానికి ప్రతిబింబంగా,ప్రతీకగా స్వతంత్రంగా,స్వేచ్ఛగా గీయగలిగే చిత్రలేఖనా సామర్థ్యం (డ్రాయింగ్ స్కిల్)పెంపొందించడానికి గాను,ఓ ప్రత్యేక సందర్భాలలో విద్యార్థులను ప్రేరేపించటం ద్వారా లేఖనానైపుణ్యం కూడా వృద్ధి చెందడం అదే క్రమంలోనే చిత్రలేఖనా నైపుణ్యాభివృద్ధికి దోహదపడుతుందని భావించి ఉపాధ్యాయులందరి సలహా సూచనలతో ఇలాంటి కృత్యాన్ని ఇవ్వడం జరుగుతుందని ప్రధానోపాధ్యాయురాలు స్వాతి తెలిపారు.వారు గీసిన తర్వాత విద్యార్థుల్లో తెలియని నూతనోత్తేజం,ఉత్సాహం, చదువుపట్ల మమకారం, ప్రత్యేకశ్రద్ధతో పాటు ఓరిమిగుణం కూడా అలవడుతుండటాన్ని

గమనించినట్లుగా ఉపాధ్యాయులు తెలిపారు. ప్రధానంగా చిత్రలేఖనం ద్వారా నీటి రంగులు, ఆయిల్ పెయింట్స్,అక్రలిక్ రంగులు మరియు సహజసిద్ధమైన రంగుల వినియోగంపై అవగాహన పెంపొందుతుందన్నారు.అదే క్రమంలో సమీప భవిష్యత్తులో విద్యార్థులు పెరిగి పెద్దవారైన తర్వాత వారిలో భారతీయ చిత్రకళ మరియు శిల్పకళానైపుణ్యంపై కూడా సంపూర్ణ అవగాహన, మక్కువకు ఇదొక స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. విద్యార్థులను విద్యతోపాటుగా ఇలా కళాత్మకంగా తీర్చిదిద్దటంపై తల్లిదండ్రులు ఉపాధ్యాయులకు తమ అభినందనలు తెలిపారు.

మరిపెడ లో బలిహరణ

గ్రామంలో మార్మోగుతున్న శివనామ స్మరణ



మరిపెడ, 20 నవంబర్ (ఇది కద నిజం): మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపల్ కేంద్రం లోని సుప్రసిద్ధ శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రవరాంభిక అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం నేత్ర పర్వంగా కొనసాగుతోంది. ఆలయ అర్చకులు పాకాల రఘురాం శర్మ ఆధ్వర్యంలో సంప్రదాయ బద్ధంగా పూజ క్రతువులు వేద పండితులు మంత్రోశ్చరణల నడుమ వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం ఏర్పాటు చేసిన బలి హరణ కార్యక్రమంలో యువకులు పాల్గొని గ్రామ పురవీధుల్లో బలిహరణ చేశారు. కార్యక్రమంలో అనుముల సుధాకర చారి, రేఖ రమేష్, ఉప్పల సతీష్, వెర్మ రెడ్డి అశోక్ రెడ్డి, వేణు, శివ, అశోక్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
శనివారం 21-11-2026

సినిమా న్యూస్



‘హైందవ’ రిలీజ్ వాయిదా?

బెల్లంకొండ సాయి శ్రీనివాస్, సంయుక్త మీనన్ జంటగా నటిస్తున్న మూవీ ‘హైందవ’ విడుదల వాయిదా పడబోతోందంటూ సోషల్ మీడియాలో ఒక వార్త తెగ వైరల్ అవుతోంది. ముందుగా అనుకున్న ప్లాన్ ప్రకారం ఈ సినిమాను నవంబర్ 27న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ భావించారు. కానీ ఇప్పుడు రిలీజ్ డేట్ విషయంలో చిత్రబృందం పునరాలోచనలో పడినట్లు టాక్ . ఇందుకు బాక్సాఫీస్ వద్ద ఉన్న గట్టి పోటీనే కారణమని తెలుస్తోంది. అదే రోజున రష్మిక మందన్న ప్రధాన పాత్రలో నటించిన ‘మైసా’, శర్వానంద్ హీరోగా నటిస్తున్న ‘భోగి’, విజయ్ ఆంటోనీ ‘నాన్నకుట్టి’ సినిమాలు కూడా థియేటర్లలోకి వస్తున్నాయి.

అయితే ఇన్ని సినిమాలు ఒకేరోజు రిలీజ్ అయితే థియేటర్ల దగ్గర ఇబ్బందులు వస్తాయని, అందుకే థియేటర్ల సమస్య తలెత్తకుండా ఉండేందుకే ‘హైందవ’ను వాయిదా వేయాలనే ఆలోచనలో మేకర్స్ ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. అయితే ఈ విషయంపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన రానప్పటికీ.. చిత్రబృందం ప్రమోషన్స్ చేయకపోవడంతో.. ఈ వాయిదా వార్తలకు బలం చేకూరినట్లు అయింది. కాగా.. లుధీర్ బైరెడ్డి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ మిస్టికల్ డివోషనల్ యాక్షన్ థ్రిల్లర్‌ను మూన్ షైన్ పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. ఇందులో జేడీ చక్రవర్తి, శుభలేఖ సుధాకర్, మహేష్ మంజ్రేకర్, గెటప్ శ్రీను కీలక పాత్రల్లో కనిపించనున్నారు. పురాతన ఆలయంలో విగ్రహాలు మాయమవడం, ఆ తర్వాత చోటుచేసుకునే ఒక హత్య కేసు చుట్టూ ఈ కథ తిరుగుతుందని సమాచారం.



కోత మొదలయ్యేది అప్పుడే..

శర్వానంద్ హీరోగా, దర్శకుడు సంపత్ నంది తెరకెక్కిస్తున్న క్రేజీ పీరియడ్ యాక్షన్ డ్రామా ‘భోగి’ విడుదల తేదీపై ఎట్టకేలకు స్పష్టత వచ్చింది. వాస్తవానికి ఈ సినిమా నవంబర్ 12న ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉండగా, కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా పడింది. దీంతో సినిమా ఎప్పుడు రిలీజ్ అవుతుందా అని ఎదురుచూస్తున్న అభిమానులకు సంపత్ నంది గుడ్ న్యూస్ చెప్పారు. ఈ చిత్రాన్ని నవంబర్ 27న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. రిలీజ్ డేట్ పోస్టర్‌తో పాటు సంపత్ నంది ఇచ్చిన మాస్ క్యాప్షన్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

ఇది కేవలం వాయిదా మాత్రమే కాదని, డబుల్ ఇంపాక్ట్, డబుల్ ధమాకా ఎంటర్‌టైన్‌మెంట్ ఉంటుందని చెబుతూ.. నవంబర్ 27న గంగ కోత మొదలైతది అంటూ సినిమాపై అంచనాలను అమాంతం పెంచేశారు. ఈ చిత్రంలో శర్వానంద్ సరసన అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయాతి హీరోయిన్లుగా నటిస్తున్నారు. 1960ల కాలం నాటి నేపథ్యంలో, తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దుల్లోని ఒక కల్పిత గ్రామంలో జరిగే ఉత్కంఠభరిత సంఘటనల చుట్టూ ఈ కథ తిరుగుతుంది. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. తెలుగుతో పాటు తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో ఈ సినిమా పాన్-ఇండియా స్థాయిలో సందడి చేయనుంది.

బిడ్డకు జన్మనిచ్చిన సమంత



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత, ప్రముఖ దర్శకుడు రాజ్ నిడిమోరు దంపతులు తల్లిదండ్రులయ్యారు. నవంబర్ 19 సమంత పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చారు. ఈ శుభవార్తను సమంత స్వయంగా తన సోషల్ మీడియా ఖాతా వేదికగా అభిమానులతో పంచుకున్నారు. అంతేకాకుండా, తమ ముద్దుల తనయుడికి ‘దేవ్ నిడిమోరు’ అని పేరు ఖరారు చేసినట్లు ఆమె అధికారికంగా ప్రకటించారు. కొత్త జీవితంలోకి అడుగుపెట్టిన సమంత – రాజ్ దంపతులకు సినీ ప్రముఖులు, అభిమానులు సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. ‘మా అందమైన బిడ్డకు స్వాగతం’ అంటూ సమంత చేసిన పోస్ట్ ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. కాగా, గతేడాది డిసెంబర్ 1, 2025న కోయంబత్తూరులోని ఈషా యోగా సెంటర్‌లో అత్యంత సన్నిహితులు, కుటుంబ సభ్యుల సమక్షంలో సమంత, రాజ్ నిడిమోరు వివాహ బంధంతో ఒక్కటయ్యారు. ఈ ఏడాది జూన్‌లో ‘మా ఇంటి బంగారం’ చిత్రం విడుదలైన తర్వాత సమంత తన ప్రెగ్నెన్సీ విషయాన్ని అధికారికంగా వెల్లడించి, మాతృత్వాన్ని ఆస్వాదించేందుకు సినిమాలకు తాత్కాలిక విరామం తీసుకున్నారు. తాజాగా పండంటి మగబిడ్డకు జన్మనిచ్చారు.

రోటర్‌డామ్ ఫెస్టివల్‌కు ‘డోరతి’!

విభిన్నమైన కథలను తెరకెక్కిస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ రూపొందించిన తాజా చిత్రం ‘డోరతి’ మరో అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. ప్రతిష్టాత్మక రోటర్‌డామ్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ లోని లైమ్‌లైట్ విభాగానికి ఈ సినిమా ఎంపికైంది. ఈ విషయాన్ని దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ సోషల్ మీడియా వేదికగా షేర్ చేయడంతో సినీ అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కీర్తి సురేష్, సనంత్, రిషికాంత్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వం వహించడంతో పాటు నిర్మాణంలోనూ భాగస్వామిగా ఉన్నారు. జియో స్టూడియోస్, సిఖ్యా ఎంటర్‌టైన్‌మెంట్, ధమ్మమ్ ఫిల్మ్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించాయి.

లెజెండరీ సంగీత దర్శకుడు ఇళయరాజా సంగీతం అందించడం మరో ప్రత్యేక ఆకర్షణ. 1990ల ప్రారంభంలో తమిళనాడు గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ కథలో స్నేహం, ప్రేమ, కులవివక్ష, మానవత్వం వంటి అంశాలను హృద్యంగా చూపించారు. భారీ అంచనాలు మధ్య మొదట తమిళంలో రిలీజైన ఈ చిత్రం అక్టోబర్ 23 తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చి మిక్స్‌డ్ టాక్ సొంతం చేసుకుంది. అయితే.. థియేటర్స్‌లో గుర్తింపు లభించని ఈ చిత్రం గతంలో టొరంటో ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లోనూ ప్రదర్శితమై ప్రశంసలు అందుకోగా.. ఇప్పుడు రోటర్‌డామ్ ఫిల్మ్ ఫెస్టివల్ ఎంపికతో ‘డోరతి’ అంతర్జాతీయ స్థాయిలో మరోసారి భారతీయ సినిమా సత్తాను చాటుతోంది.

డైరెక్ట్ ఓటీటీలోకి ‘శ్రీమతి’!

35 చిన్న కథ కాదు’ మూవీ తర్వాత దాదాపు రెండేళ్ల విరామం తీసుకున్న నటి నివేదా థామస్, ‘శ్రీమతి’ అనే ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామాతో తిరిగి ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. విభిన్నమైన కథలతో ఆకట్టుకుంటున్న తిరువీర్ ఇందులో కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రంలో నివేదా థామస్ ‘మధుశ్రీ’ అనే మధ్యతరగతి గృహిణిగా నటిస్తున్నారు. కుటుంబ బాధ్యతలను మోస్తూనే తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు కోసం మధుశ్రీ పడే తపన, తీసుకునే నిర్ణయాలు ప్రతి తెలుగింటి ఆడపడుచుకు దగ్గరయ్యేలా దర్శకుడు విశ్వక్ ఖండేరావు ఈ కథను తీర్చిదిద్దారు.

గోపరాజు రమణ, విజ్జి చంద్రశేఖర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టీజర్‌ను విడుదల చేసిన నివేదా థామస్ ‘ప్రతి శ్రీమతి వెనుక ఒక కథ ఉంటుంది. ఈ శ్రీమతి కలలు, ఆశలు, జీవిత ప్రయాణం ఎంటో తెలుసుకుందాం” అనే క్యాప్షన్ జత చేశారు. టీజర్‌లో నివేదా కళ్లలోని హావభావాలు, తిరువీర్ సహజమైన నటన సినిమాపై మంచి బజ్ క్రియేట్ చేశాయి. ఇక ఈ మూవీని థియేటర్లలో కాకుండా నేరుగా ఓటీటీలో విడుదల చేస్తున్నట్లు వెల్లడించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ‘శ్రీమతి’ డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను జీ5 సొంతం చేసుకోగా, డిసెంబర్ 4 నుంచి ప్రేక్షకుల ముందుకు రానుంది.



